ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
మన ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :293 సోమవారం ఆగష్టు 17 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# నెలవారీ వసూళ్లు మామూళ్లు ముట్ట చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి


# ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో




ములుగు జిల్లా రవాణా శాఖలో అవినీతి 'కోడ్' భాష! సామాన్యుడి రక్తం పీల్చుతున్న వసూళ్ల దందా ?ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయం నేడు అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా మారింది.సామాన్యుల నుండి డబ్బులు గుంజుతూ, ఇక్కడ ప్రతి పనికి ఒక రేటు అంటూ అక్రమ వసూళ్లకు అడ్డాగా మారిపోయింది. ఈ కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి చట్టాల కంటే 'కోడ్' భాష, 'సంఖ్యలు' మాత్రమే ముఖ్యం. !'ఫైల్‌కు పై కోడ్' పేరుతో సాగుతున్న ఈ అక్రమ దందా, సామాన్యుడి నరనరాన డబ్బులు గుంజుతూ, ప్రజలను నిస్సహాయ స్థితిలోకి నెట్టేస్తోంది.కోడ్' భాషలో అవినీతికి అంకురార్పణ!ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తుదారుల పత్రాలను ముందుగా చూడరు. దానికి బదులుగా దరఖాస్తు వెనుక ఉన్న సంఖ్యను మాత్రమే చూస్తారు. ఈ 'కోడ్' భాషలోనే కార్యాలయంలోని అధికారులు, బ్రోకర్లు మాట్లాడుకుంటారు. ప్రతి ఫైల్‌కు ఒక ప్రత్యేకమైన 'కోడ్' వేస్తారు. ఈ కోడ్ సంఖ్యను బట్టి ఫైల్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. !

వారి భాషలో సరైన 'కోడ్' ఉంటేనే పని చకచకా పూర్తవుతుంది. 'కోడ్' తప్పు అయితే ఎన్ని రోజులు తిరిగినా, ఎంత మంది చెప్పినా పని పూర్తి అవ్వదు. ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఒక 'కోడ్‌కు' ఉన్న విలువ మనుషులకు, వారి అవసరాలకు లేకపోవడం దారుణం. అక్కడ దళారులను, బ్రోకర్లను కలిసి బేరాలు మాట్లాడుకుని, 'కోడ్' వేస్తేనే ఇక్కడ కార్యాలయంలో పని పూర్తవుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా కూడా పని జరగదు !.అవినీతి ఇక్కడ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లుతోంది. అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోంది.

**దళారుల వ్యవహారం: అధికారులు కళ్ళు మూసుకున్నారా?** రవాణా శాఖ కార్యాలయంలో ప్రతి పనికి ఒక రేటు ఉంటుంది. ఒక్కో పనికి ఒక్కో అధికారిని కలవాల్సి ఉంటుంది. సాక్షాత్తు కౌంటర్‌లోని అధికారి కూడా దరఖాస్తు వెనుక వైపు 'మీ బ్రోకర్ ఎవరు, అతని పేరు కోడ్ రూపంలో రాయమని' అడుగుతారు. ఒకవేళ దరఖాస్తుదారుడు నేరుగా వచ్చామని చెప్తే, దరఖాస్తు ఏదో ఒక కారణంతో పక్కకు వెళ్ళిపోతుంది. కింది స్థాయి ఉద్యోగులను గాడిలో పెట్టాల్సిన అధికారులే అవినీతికి పాల్పడితే, సిబ్బంది సరైన మార్గంలో ఎలా నడుస్తారు? అందుకే జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాలు అవినీతికి అడ్డాలుగా మారిపోయాయి. వాహనదారులు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్లు, పాత వాహనాలకు నంబర్లు వంటి ఏ పనులు చేయించుకోవాలన్నా నేరుగా ఆర్.టి.ఏ కార్యాలయంలోకి వెళితే పనులు కావడం లేదు. డ్రైవింగ్ సరిగ్గా రాకపోయినా, వాహనాలు ఉండి లైసెన్సులు లేకపోయినా, దళారుల వద్దకు పోయి వారు చెప్పిన 'ఫీజులు' చెల్లిస్తే పనులు అయిపోతాయి. ఈ తంతు మొత్తం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




**పాతుకుపోయిన అక్రమ వసూళ్లు: అధికారులకు వాటాలు!**
ములుగు జిల్లాలో అవినీతికి అలవాటుపడ్డ రవాణా శాఖ అధికారుల అక్రమ ఆదాయం రోజుకు కొన్ని లక్షల రూపాయలు పైమాటే అని ఆరోపణలు వినిపిస్తున్నాయి.? రవాణా శాఖ కార్యాలయ పరిసరాల్లోని ఏజెంట్ల ద్వారా పనులు చక్కబెడుతున్న అధికారులు, వారి స్థాయిని బట్టి వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా ఈ లంచాల వ్యవహారం అటెండర్ నుండి అధికారి వరకు యథేచ్ఛగా సాగుతోందనేది బహిరంగ రహస్యం. అయినప్పటికీ, అధికారుల అక్రమ దందాపై శాఖాపరంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు కొన్ని ఏళ్లుగా ఇక్కడే పని చేస్తూ పాతుకుపోయారు. డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కూడా వీరే చెప్పింది ఫైనల్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బాస్‌లు కూడా కింది స్థాయి ఉద్యోగులతో చేతులు కలపడంతో ఈ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది.




**అడిగినంత ఇవ్వాల్సిందే! వాహనదారులపై అదనపు భారం!**రవాణా శాఖలో వాహనదారులకు లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి కార్యకలాపాల కోసం ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ, ఏజెంట్ల ద్వారా వెళ్తేనే ఎలాంటి పనైనా వెంటనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ఏజెంట్ అడిగినంత ముట్టజెప్పాల్సిందే. వీటికి తోడు వాహనాల ఫిట్‌నెస్‌లు, పేర్ల మార్పిడిలకు కూడా అదనంగా గుంజుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. జిల్లాలో ఇసుక, గ్రానైట్ రవాణా చేసే లారీలు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్నందున రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని నివారించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలి. కానీ, లారీ యజమానుల నుంచి నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు జిల్లా పరంగా ఎక్కడపడితే అక్కడ వెహికల్ చెకింగ్ అని పేరు చెప్పి అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నా డబ్బులు వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. జిల్లాలో ఉన్న కొంతమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు నెలవారీగా మామూళ్లు ముట్టజెపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**జిల్లా కలెక్టర్, అవినీతి నిరోధక శాఖ దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది!**ఇప్పటికైనా ములుగు జిల్లా కలెక్టర్ స్పందించి, అవినీతి నిరోధక శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు ములుగు రవాణా శాఖ అక్రమ వసూళ్ల పరంపరపై దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్న ఈ అవినీతి వ్యవస్థపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేచి చూడండిఅతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో

మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455

# ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :293 సోమవారం ఆగష్టు 17 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## ప్రియాంక కేసుకు ప్రత్యేక దర్యాప్తు

- ఏఎస్పీ మునీష్‌కు విచారణ బాధ్యతలు
- బాధిత కుటుంబానికి రూ.20 లక్షల సాయం
- నిందితులకు కఠిన శిక్షలపై సీఎం ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఐపీఎస్ అధికారి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ పాటిల్ దేవరాజ్ మునీష్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో విచారణను త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దర్యాప్తు ప్రక్రియలో సౌత్ డీఎస్పీ శివప్రియ, ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్ ప్రత్యేక అధికారికి సహకరించాలని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని అకాల మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటి ప్రభావశీలులైనా ఉపేక్షించవద్దని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించి



బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా ఏక్లాస్‌పూర్‌కు చెందిన ప్రియాంక తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఓ వైద్య కళాశాలలో చర్మవ్యాధుల విభాగంలో పీజీ విద్యనభ్యసిస్తున్నారు. ఆగస్టు 3న రాజమహేంద్రవరంలో సినిమా చూసి తిరిగి వస్తున్న సమయంలో ఆమె ప్రయాణిస్తున్న స్కూటీని ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం మొదట స్థానిక ఆసుపత్రికి, అనంతరం సికింద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆగస్టు 10న ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుండగా, ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు అధికారిని నియమించి కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

## రేషన్ కార్డులపై బీఆర్ఎస్ విమర్శలు



- రేవంత్, ఉత్తమ్ ఫొటోలపై ప్రశ్నలు
- శాసనమండలి వ్యాఖ్యలను గుర్తుచేసిన సునీత
- ప్రభుత్వంపై అబద్ధాల ఆరోపణలు

2

## బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి హాజరైన సీఎం



- హైదరాబాద్‌లో ఘనంగా వివాహ వేడుక
- వధూవరులను ఆశీర్వదించిన రేవంత్
- సినీ, రాజకీయ ప్రముఖుల సందడి

2

## యువతే భారతదేశానికి అతిపెద్ద బలం ఉపరాష్ట్రపతి

-ఎస్ఆర్ఎమ్ పట్టాభిషేకోత్సవంలో ప్రసంగం
-ప్రతిభతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపు




చెన్నై, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ యువతే దేశానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. భవిష్యత్తు కోసం సిద్ధం కావడమే కాకుండా భవిష్యత్తును మలిచే నాయకులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చెన్నై సమీపంలోని చెంగల్పట్టు జిల్లా కట్టంకులత్తూరులో ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 22వ పట్టాభిషేకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాలు అందుకుంటున్న విద్యార్థులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. భారతదేశం యొక్క గొప్ప శక్తి ప్రజలేనని, ముఖ్యంగా యువతలో అపారమైన సామర్థ్యం ఉందని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. "భవిష్యత్తు కోసం మాత్రమే మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవద్దు.. భవిష్యత్తును మలిచే స్థాయికి ఎదగండి" అని విద్యార్థులకు సందేశమిచ్చారు. జ్ఞానం, నైపుణ్యాలు, విలువలను సమన్వయం చేసుకుంటూ సమాజానికి ఉపయోగపడే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఆటోమోటివ్ విభాగం అధ్యక్షుడు ఆర్. వెలుస్వామికి









ఉపరాష్ట్రపతి గౌరవ డిగ్రీ ప్రదానం చేశారు. పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ఎస్ఆర్ఎమ్ విద్యాసంస్థల ఛాన్సలర్ టి.ఆర్. పారివేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టాభిషేకోత్సవం విద్యార్థుల జీవితంలో కీలక మైలురాయని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ప్రపంచ స్థాయి పోటీలో భారత యువత తమ ప్రతిభను నిరూపించగల సామర్థ్యం కలిగి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పట్టభద్రులకు సూచించారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకు సీఎం నివాళులు



- స్వాతంత్ర్య సమరయోధుడి జయంతి వేడుకలు
- సేవలను స్మరించిన చంద్రబాబు
- బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం

2

## జనని వివాహంలో ప్రముఖుల సందడి



- ఘనంగా జరిగిన పెళ్లి వేడుక
- నూతన దంపతులను ఆశీర్వదించిన అతిథులు
- భావోద్వేగానికి గురైన బండ్ల గణేశ్
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

హైదరాబాద్, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో జనని వివాహ బంధంలో అడుగుపెట్టారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ వేడుకకు రాజకీయ, సినీ

## ట్రంప్ పోస్టు...కొరియాలో ఉద్రిక్తతలు



- కిమ్‌తో పాత ఫొటో పంచుకున్న ట్రంప్
- సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం
- ద్వీపకల్పంలో మళ్లీ యుద్ధ మేఘాలు

వాషింగ్టన్, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య ఉన్న సంబంధాలు మరోసారి అంతర్జాతీయ చర్చకు దారితీశాయి. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో కలిసి దిగిన పాత ఫొటోను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫొటోలో తాము గంభీరంగా కనిపిస్తున్నప్పటికీ, నవ్వుతూ దిగిన చిత్రాలు కూడా చాలా ఉన్నాయని పేర్కొన్నారు. కిమ్ జాంగ్ ఉన్‌తో తాను చాలా బాగా కలిసిపోతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. గతంలో అమెరికా-ఉత్తర కొరియా సంబంధాల మెరుగుదలకు ఇద్దరు నేతలు పలుమార్లు సమావేశమయ్యారు. సింగపూర్, హనోయ్ సమావేశాల సమయంలో ట్రంప్, కిమ్ మధ్య వ్యక్తిగత అనుబంధం అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. ఇప్పుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ఆ

2

# రేషన్ కార్డులపై బీఆర్ఎస్ విమర్శలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): రేషన్ కార్డుల వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేసింది. రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ముద్రించడం ఎందుకని ప్రశ్నించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసిందని ఆరోపించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వాకిటి సునీత మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి రాష్ట్రాభివృద్ధిపై స్పష్టమైన విధానం లేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 6 లక్షల 47 వేల రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనమండలిలో స్వయంగా వెల్లడించారని సునీత గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమేనని పేర్కొన్నారు. రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఒకవైపు గత ప్రభుత్వం కార్డులు జారీ చేసిందని అంగీకరిస్తూనే, మరోవైపు వాటిని తిరస్కరించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించింది.ప్రజలకు సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని సునీత ఆరోపించారు. రేషన్ కార్డుల పంపిణీ విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు.

# బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి హాజరైన సీఎం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుమార్తె జనని వివాహ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. జననిసూర్యతేజల వివాహానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుక నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. వివాహ కార్యక్రమానికి సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వివాహ వేడుకకు హాజరై బండ్ల గణేష్ కుటుంబ సభ్యులను అభినందించారు. వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులతో ఆయన ముచ్చటించారు. బండ్ల గణేష్ తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతగా, నటుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన కుమార్తె జనని వివాహ వేడుకను కుటుంబ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. జనని, సూర్యతేజ నిశ్చితార్థం కూడా ఈ ఏడాది హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన విషయం తెలిసిందే.వివాహ వేడుకకు హాజరైన అతిథుల సందడితో జేఆర్సీ కన్వెన్షన్ కేంద్రం కళకళలాడింది. వధూవరులకు ఆశీస్సులు అందించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# సర్దార్ గౌతు లచ్చన్నకు సీఎం నివాళులు

మెదటి పేజీ తరువాయి



అమరావతి, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో, సామాజిక న్యాయం కోసం లచ్చన్న చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడించింది. సర్దార్ గౌతు లచ్చన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొనడంతో పాటు రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారు. 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో జన్మించిన లచ్చన్న చిన్న వయసులోనే జాతీయోద్యమంలో అడుగుపెట్టారు. ఉప్పు సత్యాగ్రహం, భారత్ విడిచి పోవు ఉద్యమాల్లో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయనకు “సర్దార్” అనే బిరుదు లభించింది. స్వాతంత్ర్యం అనంతరం కూడా రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన కృషి కొనసాగింది. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలోనూ, ప్రజా హక్కుల సాధనలోనూ కీలక పాత్ర పోషించారు. దశాబ్దాల పాటు శాసనసభలో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రజా నాయకుడిగా నిలిచారు.సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తోంది. ఆయన సేవలు భావితరాలకు ఆదర్శమని పలువురు నేతలు పేర్కొంటూ నివాళులు అర్పించారు.

# ట్రంప్ పోస్టు...కొరియాలో ఉద్రిక్తతలు

మెదటి పేజీ తరువాయి



జ్ఞాపకాలను మళ్లీ తెరపైకి తీసుకొచ్చాయి.అయితే ట్రంప్ ఈ పోస్టు చేసిన సమయంలో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహించనున్న ‘ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్’ సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆగస్టు 17 నుంచి 27 వరకు జరగనున్న ఈ విన్యాసాల్లో డ్రోన్ల దాడులను ఎదుర్కోవడం, జీపీఎస్ అంతరాయాలను అధిగమించడం, సైబర్ యుద్ధ వ్యూహాలు వంటి ఆధునిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై స్పందించిన ఉత్తర కొరియా విదేశాంగ శాఖ అమెరికా, జపాన్, దక్షిణ కొరియా మధ్య పెరుగుతున్న సైనిక సహకారాన్ని ‘అణు కూటమి’గా అభివర్ణించింది. తమపై పెరుగుతున్న భద్రతా ముప్పులకు తగిన స్థాయిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. అధికారిక వార్తా సంస్థ ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కొత్త స్థాయి ముప్పులను కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టం చేసింది.గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఈసారి నిర్వహిస్తున్న కార్యక్రమాలు భిన్నంగా ఉన్నాయని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను పెంపొందించడమే వాటి లక్ష్యమని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ఎలాంటి ప్రమాదం ఏర్పడినా ప్రతిస్పందించడం తమ ప్రాథమిక విధానమని వెల్లడించింది. దీంతో ప్రాంతీయ భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగించింది. ఒకవైపు ట్రంప్ కిమ్‌తో తన స్నేహపూర్వక సంబంధాలను గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులు భవిష్యత్‌లో ప్రాంతీయ రాజకీయాలు, భద్రతా సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన సీపీ



## - పరకాల పర్యటనలో మర్యాదపూర్వక భేటీ
## - మొక్క అందజేసి స్వాగతం
## - హెలికాప్టర్‌లో జూనియర్ కళాశాల మైదానానికి రాక

పరకాల, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరకాల పర్యటన సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సాయంత్రం పరకాల జూనియర్ కళాశాల మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ముఖ్యమంత్రికి మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సంక్షిప్తంగా వివరించినట్లు సమాచారం.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమ ప్రాంగణం పరిసరాల్లో బందోబస్తు నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పర్యటనలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రాకతో పరకాల ప్రాంతంలో సందడి నెలకొంది.ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయని అధికారులు తెలిపారు. పర్యటన ప్రశాంతంగా ముగిసేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పలువురు అభినందించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేశారు.

# జనని వివాహంలో ప్రముఖుల సందడి

మెదటి పేజీ తరువాయి



రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు వేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వరుడు సూర్యతేజ ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి చేతుల మీదుగా తాళిని స్వీకరించి వధువు జనని మెడలో మంగళసూత్రధారణ చేశారు. ఈ ఘట్టం వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి దంపతులు హాజరుకావడం పట్ల బండ్ల గణేశ్ భావోద్వేగానికి గురయ్యారు. ఆనందభాష్పాలు పెట్టుకున్న ఆయనను సినీ నటుడు బ్రహ్మాజీ ఓదార్చారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది.బండ్ల గణేశ్‌కు సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న అనుబంధాల కారణంగా పలువురు ప్రముఖులు వేడుకకు హాజరయ్యారు. నాయకులు, నటీనటులు, నిర్మాతలు, వ్యాపారవేత్తలు నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహ ప్రాంగణం అతిథుల రాకతో సందడిగా మారింది. వివాహ వేడుకకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. నూతన దంపతులకు అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# జాతీయ భావాల కోసం యువత కదం త్రొక్కాలి

## –జెన్ జీ అంటే మంచి పనుల కోసం చేసే యువత
## –ఢిల్లీ జంతర్ మంతర్ లో అసాంఘిక యువత చోరబడ్డారుయువత ఆలోచనలను ప్రభుత్వాలు స్వీకరించాలి

3

# జాతీయ భావాల కోసం యువత కదం త్రొక్కాలి

**-యువత దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి**
**-ఆర్ఎస్ఎస్ కార్యంలో యువత గంట సమయం ఇవ్వాలిఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్**




మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 16 ఆగస్టు :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో ఇల్లంతకుంట ఖండ యువ సమ్మేళన సమితి అధ్యక్షుడు రేగుల కార్తీక్ ఆధ్వర్యంలో యువ సమ్మేళన కార్యక్రమంలో ప్రధాన వక్త కరి నగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న యువకులు అదృష్టవంతులు అని అన్నారు. ఈ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న యువత దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నానని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని దేశం గురించి ఆలోచించే మనస్తత్వం పెరగాలని అన్నారు. యువత చిన్న చిన్న విషయాలకు క్షణిక ఆవేశంలో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు చదువుతోపాటు దేశభక్తి ఉండాలని తెలిపారు. జెన్ జీ అంటే మంచి పనులు చేసే యువత అన్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ లో కొంతమంది అసాంఘిక యువత చొరబడ్డారని తెలియజేశారు. యువత ఆలోచనలను ప్రభుత్వాలు స్వీకరించాలని తెలియజేశారు. ఆర్ఎస్ఎస్ చేసే సమాజ కార్యంలో గంట సమయం యువత కేటాయించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు వారి కుటుంబాలను చూసుకుంటూ ఉద్యోగం చేస్తూ సమాజ కార్యంలో భాగస్వాములు అవుతున్నారు. ఆర్ఎస్ఎస్ లో పూర్తి సమయం కేటాయించి ప్రచారకులుగా సంఘు కార్యాన్ని నిర్వహిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించి పౌరుడు పాటించవలసిన నియమాలు పాటించాలని తెలిపారు. ప్రపంచ దేశాల అన్నింటికంటే మన భారతదేశంలో యువశక్తి ఎక్కువగా ఉంది మనం ఏ ఆలోచన చేసిన ఆ యొక్క ప్రభావం దేశం, ప్రపంచం మీద పడుతుంది అందుకే మనం ఐక్యతతో ఉండి సమాజ హితం కోసం ధర్మ మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని అంజన్న, ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్ , సహ కార్యవాహ కాసుపాక కిషన్, బౌద్ధిక్ ప్రముఖ్ నాగసముద్రాల బాలకృష్ణ, శారీరక ప్రముఖ్ కాంకటి శ్రీకాంత్, ప్రచార ప్రముఖ్ చల్ల సాగర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు ఏగుర్ల శ్రీనివాస్, సర్పంచ్ మామిడి రాజు ,వార్డ్ మెంబర్స్ ర్యాకం సుమన్, ఎర్రోజు రవితేజ, బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్, అరుణ్, వినోద్ సంతోష్, అనిల్, నిఖిల్, చరణ్, రంజిత్ యువత, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# నలుగు వేడుకలలో వరుడుని ఆశీర్వదించిన సమన్వ కర్త వేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

మన ప్రజాప్రతినిధి//కృష్ణ) న్యూస్ ఆగస్టు 16:తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గ నూతన వరుడును ఆశీర్వదించిన. నేదురుమల్లివాకాడు గ్రామపంచాయతీకి చెందిన సీనియర్ పేపర్ రిపోర్టర్ వెంకట్ శరత్ కుమార్, స్వర్ణ లక్ష్మి కుమారుడు వెంకట అభిలాష్ కుమార్ నలుగు వేడుకలను నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపము లో ఏర్పాటు చేశారు. ఈ నలుగు వేడుకలలో పాల్గొని వరుడును,ఆశీర్వదించిన వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపి సమన్వయకర్త. గౌరవ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వారి వెంట కోట, వాకాడు చిట్టమూరు మండలాలు చెందిన నాయకులు ఉన్నారు



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మన ప్రజాప్రతినిధి// మిర్యాలగూడ టౌన్ ఆగస్టు 16: మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో నిర్వహించిన పలు వివాహాది శుభకార్యాలలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో ప్రేమాభిమానాలతో ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు శుభకార్యాలకు హాజరైన పెద్దలు కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారుప్రజల సుఖదుఃఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని ప్రజల ఆప్యాయత తనకు మరింత బాధ్యతను పెంచుతుందని ఈ సందర్భంగా తెలిపారుఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులుకార్యకర్తలుపాల్గొన్నరు


# కలప అక్రమ దారులు అరెస్ట్



మన ప్రజాప్రతినిధి// ఖమ్మం జిల్లా:సీసీయస్ పోలీస్ స్టేషన్ ఖమ్మంఏసీపీ సిసియస్ఫారెస్ట్ అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాలను ట్యాంపరింగ్ చేసి కలప అక్రమ రవాణా చేసిన ఇద్దరు నిందుతులను సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేసిన రిమాండ్ తరలించినట్లు సిసియస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్ లో ఖమ్మం ఫారెస్ట్ రేంజర్ ఫిర్యాదు మేరకు ఖమ్మం సిసియస్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఏసిపి మహమ్మద్ సర్వర్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ గౌడ్ దర్యాప్తు చేసి నిందితులను ఆదివారం అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. కేసు వివరాలు ప్రకారం...నల్ల తుమ్మ కర్ర సరఫరా కోసం ఖమ్మం ఫారెస్ట్ కార్యాలయం నుండి వేరే ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద అనుమతి పత్రాలను తీసుకోని దానిని టాంపరింగ్ చేసి సంద్ర కర్ర గా పేరు మార్చి, చుట్టు పక్కల గ్రామాలైన అయ్యగారూపల్లి, కురవి, సీరోలు, కంపెళ్ళి, మహబూబాబాద్ ప్రాంతాల్లో నుండి సంద్ర చెట్లను నరికి ఇట్టి నకిలీ పర్మిషన్ పేరుతో విజయవాడ కు చెందిన రాధే శ్యామ్ కు విక్రయించిన సూర్యాపేట జిల్లా, మోతే మండలం, గోప్య తండా కు చెందిన కర్ర వ్యాపారి కొర్ర శివ తో పాటు రాధే శ్యామ్ ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.నిందితుడు కొర్ర శివ పై వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో కూడా ఫారెస్ట్ కేసులు నమోదు అయినట్లు విచారణ తెలిందని తెలిపారు. రాధే శ్యామ్ అనే వ్యక్తి ఇట్టి కర్రను మధ్య ప్రదేశ్ లోని జాబువా పట్టణం లోని ఎమ్ ఎంటర్ప్రైజెస్ అబ్దుల్ రహేమాన్ కు సరఫరా చేశారని, మధ్య ప్రదేశ్ లో ఇట్టి కర్రను పాన్ మసాలా లో వాడే కత్తా తయారీలో వాడుతారన్నారు. ఈ విధంగా సుమారు 9 లారీ ల కర్రకు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ కొనసాగుతుందని ఇతరుల ప్రమేయన్ని గుర్తించి అరెస్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కేసు నందు ప్రతిభ కనబరచిన ఏసీపీ సర్వర్, ఇన్స్పెక్టర్ ఎస్సై.రాజ్‌కుమార్ గౌడ్,ఎస్సై ఎ. వంశీ కృష్ణ, కానిస్టేబుల్ శ్రీనివాస్, హరి, జానీ, నరింహారావు, సుధీర్, సతీష్, సుందర్, శ్రీధర్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభిందించారు.

# నూతన గృహప్రవేశం

మన ప్రజాప్రతినిధి//పుల్కల్ ఆగస్టు 16 :పుల్కల్ మండల్ ఎస్ ఇటిక్యాల గ్రామంలో ఆదివారం నాడు ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుల్కల్ మండల్ అధ్యక్షులు దుర్గరెడ్డి గారిచేతులు మీదుగా గృహప్రవేశం చేయడం జరిగింది .ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ సీనియర్ కార్యకర్తలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన వారు బేగరి వరలక్ష్మి అనిల్ కుమార్ దంపతులు నిర్వహించడం జరిగింది



# అర్హులైన మహిళలను పెన్షన్‌కు దూరం చేయొద్దు




మన ప్రజాప్రతినిధి// మిర్యాలగూడ టౌన్ ఆగస్టు 16 :అర్హులైన మహిళలను పెన్షన్‌కు దూరం చేయొద్దు బి ఆర్ఎస్ పట్టణ కమిటీ మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఒంటరి మహిళా పెన్షన్‌కు అర్హులైన వారికి దరఖాస్తులు వెంటనే తహశీల్దార్ ధృవీకరణ పత్రాలు జారీ చేయకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బి ఆర్ఎస్ పట్టణ కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఈ రోజు మిర్యాలగూడ పట్టణంలోని బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఒంటరి మహిళా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అనేక మంది మహిళలకు అవసరమైన తహశీల్దార్ ధృవీకరణ పత్రాలు అందకపోవడంతో తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటో తెలియక అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. భర్తను కోల్పోయిన లేదా కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు ప్రభుత్వ పెన్షన్ ఎంతో కీలకమైన ఆర్థిక సహాయమని, అధికారుల నిర్లక్ష్యం లేదా ధృవీకరణ ప్రక్రియలో జాప్యం కారణంగా అర్హులైన మహిళలు సంక్షేమ పథకానికి దూరం కాకూడదని అన్నారు మిర్యాలగూడ నియోజకవర్గంలోని సంబంధిత తహశీల్దార్లకు నల్లగొండ జిల్లా కలెక్టర్ గారు వెంటనే ఆదేశాలు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ఒంటరి మహిళలకు ధృవీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయించాలని బి ఆర్ఎస్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒంటరి మహిళకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బాధిత మహిళల తరఫున బి ర్ స్ పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమములో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్,పెద్ది శ్రీనివాస్ గౌడ్, పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర రావు, తీరంశెట్టి సీతా కోటేశ్వర రావు,పునాతి లక్ష్మీనారాయణ, దీపిక విజయ్, జానకమ్మ దుర్గాప్రసాద్,లావుడి అరుణ సుధాకర్, సందేషి రజిని అంజన్ రాజు,మర్రి అంజిబాబు,తిరుమలగిరి వజ్రం,వడ్డేపల్లి శ్రీనివాస్,జన్నపాల సునీత కిరణ్, యర్రమల్ల దినేష్,గంగుల బిక్షం యాదవ్, భూక్య రాంబాబు,ఆయిల వెంకన్న,ఎనుగంటి తిరుపతయ్య నాయుడు,వల్లపట్ల వినోద్,కందగట్ల అశోక్,పందిరి వేణు,నునే రవి కుమార్ కంచర్కుంట్ల దయాకర్ రెడ్డి,నేరెళ్ళ శివతదితరులు ఉన్నారు

# వివాహా వేడుకల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

మన ప్రజాప్రతినిధి// చేగుంట ఆగస్ట్ 16,:చేగుంట మండలం మక్కారాజ్ పేట్ గ్రామ ఉపసర్పంచ్ మొగులయ్య కూతురి వివాహనికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమం చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,ఉపాధ్యక్షులు మాసాయిపేట శ్రీనివాస్,పాక్స్ ఛైర్మెన్ మ్యకల పరమేష్,మండల కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్ మొజామిల్,చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్,మాజీ సర్పంచ్ రాంపూర్ కాశబోయిన భాస్కర్, కాంగ్రెస్ నాయకులు జింక శ్రీనివాస్,శ్రీకాంత్,ముజ్జు, కొండల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు



# మెడికో విద్యార్థి ఆత్మహత్య



మనప్రజాప్రతినిధి//చేగుంట ఆగష్టు 16 :ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంతాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది.మెదక్ జిల్లా మసాయి పేట్ మండల పరిదిలోని చెట్ల తిమ్మాహి పల్లి గ్రామానికి చెందిన కోల్మారి భరద్వాజ్ (18),పి ఎస్ కాలనిలో ఉంటూ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి, భవనం పై నుంచి దూకి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడు తెల్లవారుజామున ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం ఉదయం డయల్-100 ద్వారా అందిన సమాచారంతో ఎన్ఎస్ఎల్ నిర్మాణంలో ఉన్న భవనం వద్ద యువకుడు మృతి చెందినట్లు గుర్తించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.యువకుడి మృతితో గ్రామం లో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు

# రోడ్డెక్కిన పశువులు.. నిర్లక్ష్యానికి నిదర్శనం

**-పశువుల నియంత్రణపై పట్టింపు కరవు**
**-కనుమరుగైన బందెల దొడ్లు**
**-రహదారులపై పెరుగుతున్న పశువుల సంచారం**
**-అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**
**-మున్సిపల్ పాలకవర్గంపై ఆశలు.. చర్యలు మాత్రం శూన్యం**



మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్, ఆగష్టు16:హుజూర్‌నగర్ మెయిన్ రోడ్లపై పశువుల సంచారం మాత్రం తగ్గడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో యజమానులు పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాల్లో పశువులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో రహదారులపై పశువులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పశువుల కారణంగా పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.బందెల దొడ్లు ఏమయ్యాయి?గతంలో గ్రామాల్లో పశువులను అదుపులో ఉంచేందుకు బందెల దొడ్లు ఉండేవి. పశువులను రోడ్లపైకి వదిలేస్తే వాటిని అక్కడికి తరలించి యజమానులకు జరిమానాలు విధించే విధానం ఉండేది. కాలక్రమంలో ఆ వ్యవస్థ కనుమరుగవడంతో పశువుల యజమానులు వాటిని స్వేచ్ఛగా రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో పశువుల సంరక్షణ బాధ్యత ప్రజలపై, వాటి నియంత్రణ బాధ్యత అధికారులపై ప్రశ్నార్థకంగా మారింది.నిబంధనలు ఉన్నా.. అమలు ఎక్కడ?పశువులను రోడ్లపై వదిలేయకుండా యజమానులను నియంత్రించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉంది. అవసరమైతే పశువులను పట్టుకుని సంరక్షణ కేంద్రాలకు తరలించడం, యజమానులపై జరిమానాలు విధించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ పాలకవర్గంపై ఆశలుపట్టణంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు మున్సిపల్ పాలకవర్గాన్ని కోరుతున్నారు. పశువుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట బందెల దొడ్లను ఏర్పాటు చేసి పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై అధికారులు ఇప్పటికైనా మేల్కొని చర్యలు తీసుకుంటారా? లేక రోడ్లపై పశువుల సంచారం ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

# చేయూత పింఛన్ల పంపిణీకి శ్రీకారం

**-సమ్మక్కసారలమ్మలను దర్శించిన సీఎం**
**-వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లు**
**-మేడారంలో తాగునీటి ప్లాంట్ ప్రారంభం**



ములుగు, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): వనదేవతలు సమ్మక్కసారలమ్మ సన్నిధిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా సమ్మక్కసారలమ్మ గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులో భాగంగా సమ్మక్కసారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్థానికంగా అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మేడారం నుంచే లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మేడారానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. మహిళల ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, సంఘాల కార్యకలాపాలపై వివరాలు తెలుసుకుని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు దానసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ రామచంద్ర నాయక్, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, పోరిక బాలరాం, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ములుగు కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభం

**-తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ**
**-జిల్లా అభివృద్ధికి నిధుల హామీ**
**-సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**



ములుగు, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి అధికారికంగా ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ప్రకటించారు. వనదేవతలు సమ్మక్కసారలమ్మ ఆలయ అభివృద్ధి రాష్ట్ర గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.ములుగు ప్రాంతానికి అత్యంత కీలకమైన జంపన్నవాగు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క సూచన మేరకు జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం, కోర్టు భవనాల నిర్మాణ పనులను త్వరలో చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.ఈ ప్రాంత యువతకు మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా సమీకృత నివాస విద్యాలయాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత ఇస్తూ నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత సంక్షేమం కోసం ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలు సాధిస్తే ప్రపంచ స్థాయిలో పోటీ పడే అవకాశాలు పెరుగుతాయని యువతకు సూచించారు. తెలంగాణను మరింత సుభిక్ష రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని పిలుపునిచ్చారు.

# పరకాలలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం



పరకాల, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఊపునిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్, మహిళా సాధికారత, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలకు సంబంధించిన వందల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇప్పటికే పూర్తయిన పలు నిర్మాణాలను ప్రజలకు అంకితం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రూ.200 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అత్యాధునిక వసతులతో నిర్మించనున్న ఈ విద్యాసంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. అలాగే రూ.82 కోట్ల వ్యయంతో పరకాల మున్సిపాలిటీలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాల మెరుగుదలతో పట్టణ రూపురేఖలు మారనున్నాయని అధికారులు తెలిపారు.పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు రూ.65 కోట్లతో నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయితే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభించనుంది. అదేవిధంగా రూ.45.15 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. యువతకు ఆధునిక సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించే కేంద్రంగా ఇది అభివృద్ధి చెందనుంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం ఇస్తూ దామెర మండలం ల్యాదెళ్లలో రూ.32.17 కోట్ల అంచనా వ్యయంతో పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అక్కంపేట గ్రామంలో రూ.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో చేపట్టనున్న కార్యక్రమాలకు కూడా ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.ఆత్మకూర్ ప్రాంతంలో టౌన్‌షిప్ అండర్ ల్యాండ్ పూలింగ్ పథకానికి శంకుస్థాపన చేయడం మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పట్టణ విస్తరణ చేపట్టేందుకు ఈ పథకం దోహదపడనుంది. అలాగే పరకాలలో రూ.3 కోట్ల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, రూ.1.10 కోట్లతో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ నిర్మాణానికి కూడా

# టీఎంసీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఆత్మహత్య



రాంపూర్హాత్, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, టీఎంసీ సీనియర్ నేత డా. ఆశిష్ బెనర్జీ (74) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం బిర్భూమ్ జిల్లాలోని రాంపూర్హాత్ పట్టణంలో తన నివాసానికి సమీపంలో ఉన్న టీఎంసీ పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలం నుంచి ఒక సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ లేఖలో ఆశిష్ బెనర్జీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని, రాజకీయాల్లోకి రావడమే తన జీవితంలో చేసిన పెద్ద తప్పు అని పేర్కొన్నారు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కాదని స్పష్టంగా రాశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని లేఖలో వివరించారు.ఇటీవల తారాపీఠ్‌రాంపూర్హాత్ అభివృద్ధి ప్రాధికార సంస్థకు సంబంధించిన టెండర్లు, చెక్కులు, అనుమతి పత్రాల వ్యవహారాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల్లో ఆశిష్ బెనర్జీ పేరును కూడా ప్రస్తావిస్తూ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఆ ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఏ పనికీ డబ్బు డిమాండ్ చేయలేదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పార్టీలో తప్పులను తాను ఎప్పుడూ ప్రోత్సహించలేదని, అదే సమయంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిని ఎదుర్కొనే పరిస్థితిలో కూడా లేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశిష్ బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారు. బిర్భూమ్ జిల్లాలోని రాంపూర్హాత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2001 నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దాదాపు 25 సంవత్సరాల పాటు అసెంబ్లీలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించడంతో పాటు మమతా బెనర్జీ మంత్రివర్గంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆశిష్ బెనర్జీ మరణం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో విషాదాన్ని మిగిల్చింది.

# లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం కలెక్టర్

-విజయవాడ కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు
-చిత్రపటానికి పూలమాల వేసి నివాళి
-ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు



విజయవాడ, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక విప్లవకారుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా విజయవాడ కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ప్రజాసేవ, సామాజిక న్యాయం, రైతుకార్మిక సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న లచ్చన్న ఉప్పు సత్యాగ్రహం, భారత్ విడిచి పోవు ఉద్యమం వంటి అనేక పోరాటాల్లో పాల్గొని జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. సామాజిక సమానత్వం సాధన కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాసేవ అనే విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా లచ్చన్నకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని చెప్పారు. జయంతి కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్న సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని సంకల్పించారు.

# గద్వాలలో మండల స్థాయిలో ప్రజావాణి

- సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభం
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు
- మండలాల్లోనే సమస్యల పరిష్కారానికి అవకాశం



గద్వాల, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి మండల స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో ఇప్పటికే కొనసాగుతున్న ప్రజావాణిని మరింత ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రజావాణిలో పాల్గొంటారని చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని అన్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల మండల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక

-ముద్దనూరులో ప్రత్యేక కౌన్సెలింగ్
-చట్టవ్యతిరేక చర్యలపై అప్రమత్తం
-ఎస్పీ ఆదేశాలతో కార్యక్రమం



కడప, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీ షీటర్లకు పోలీసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముద్దనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు రౌడీ షీటర్లను పిలిపించి వారి ప్రవర్తన, కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నేర కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని సాధారణ జీవితం గడపాలని పోలీసులు సూచించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలు, గొడవలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తరచూ ఇలాంటి కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నేరాల నియంత్రణతో పాటు సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యమని వివరించారు.పోలీసుల సూచనలను పాటిస్తూ చట్టబద్ధమైన మార్గంలో జీవనం సాగించాలని రౌడీ షీటర్లకు సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఈ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.



# వెలిమల బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహణ
- ఘనంగా బోనాల వేడుకలు
- పెద్ద సంఖ్యలో భక్తుల హాజరు



సంగారెడ్డి, ఆగస్టు 16 (మనప్రజాప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమల గ్రామంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా బోనాలు సమర్పించిన భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు గౌడ్, రవీందర్ రెడ్డి, కొమరయ్య, రాజ్‌కుమార్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులతో కలిసి వారు కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వెలిమల గ్రామంలో బోనాల వేడుకలు ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు తెలిపారు. ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావానికి బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. పండుగను విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.





